కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్లలో కూరగాయల ధరలు కిలో రూపాయల్లో... టమోటా 15, వంకాయ 18, బెండ 35, పచ్చిమిర్చి 40, కాకరకాయ 35, బీరకాయ 40, కాలిఫ్లవర్ 23, క్యాబేజీ 13, క్యారెట్ 25, దొండ 35, ఆలుగడ్డ 25, ఉల్లిగడ్డ 16, గోకరకాయ 35, దోసకాయ 18, సొరకాయ 11, పొట్లకాయ 15, అరటికాయ 11, చిక్కుడుకాయ 55, చామగడ్డ 35, మునగ 50, కందగడ్డ 65, బీట్‌రూట్ 25, కీర 45, బీన్స్ 115, క్యాప్సికమ్ 47లుగా ఉన్నాయి.

త్రివిధ దళాలకు శక్తినివ్వాలని పూజలు



చైతన్యపురి: పాకిస్తాన్‌తో జరుగుతున్న యుద్ధానికి భారత త్రివిధ దళాలకు శక్తిని, మనోధైర్యాన్ని ప్రసాదించాలని వినాయక్‌నగర్ కాలనీలో రేణుకాఎల్లమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి కల్యాణోత్సవం కార్యక్రమంలో కార్పొరేటర్ రంగా నర్సింహ గుప్తా పాల్గొని పూజలు చేశారు. భారత ప్రధాని మోదీకి దేశప్రజలు అండగా ఉండాలని మొక్కుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఎన్‌రెడ్డినగర్ మాజీ కార్పొరేటర్ ముద్దగొని లక్ష్మీప్రసన్న, బీజేపీ నాయకులు ఉపేందర్‌గుప్తా, కోటా శారద తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

చాంద్రాయణగుట్ట: కార్మిక చట్టాల అమలు డిమాండ్‌పై మే 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో ఆశా వర్కర్లు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ చాంద్రాయణగుట్ట జోన్ కార్యదర్శి ఎస్.కిషన్ విజ్ఞప్తి చేశారు. సమ్మెలో పాల్గొనే ఆశా వర్కర్ల విషయమై బార్కాస్ క్లస్టర్ వైద్యాధికారిణికి మంగళవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆశా వర్కర్లకు సరైన వేతనాలు ఇవ్వకుండా వెట్టి చాకిరి చేయించుకుంటున్నాయన్నారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయడంతో పాటు ఆశాలకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలన్నారు.

'నిబంధనలు సడలించి రుణాలు ఇవ్వాలి'

చాంద్రాయణగుట్ట: రాజీవ్ యువ వికాసం పథకంలో ఇష్టానుసారంగా కొర్రీలు పెట్టి గందరగోళాన్ని సృష్టించడం సరికాదని బీజేపీ చాంద్రాయణగుట్ట అసెంబ్లీ కన్వీనర్ ఎడ్ల పండరీనాథ్ అన్నారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ..బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు ఆర్థికంగా ఎదిగేందుకు ఈ పథకాన్ని తీసుకొచ్చామని ప్రభుత్వం ఆర్భాటంగా పేర్కొందన్నారు. కానీ సిబిల్ స్కోర్ నిబంధన అంటూ దరఖాస్తుదారులను తిరస్కరిస్తున్నారన్నారు. బ్యాంక్‌లు సైతం రుణాలు ఇచ్చేందుకు వెనుకంజవేస్తున్నాయన్నారు. నిబంధనలను సడలించి రుణాలు ఇవ్వాలని కోరారు.

ప్రశాంతంగా పాలిసెట్

విజయనగర్‌కాలనీ: పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశాల కోసం నిర్వహించే పాలిసెట్ ఎంట్రెన్స్-2025 టెస్ట్ ప్రశాంతంగా జరిగింది. హైదరాబాద్ జిల్లాలో మాసబ్‌ట్యాంక్ కోఆర్డినేటర్ పరిధిలోని 9 పరీక్షా కేంద్రాల్లో 3,406 మంది విద్యార్థులకు గాను 3,018 మంది హాజరైయినట్లు మాసబ్ ట్యాంక్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, పాలిసెట్ కోఆర్డినేటర్ డాక్టర్ కె.చంద్రశేఖర్ తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష నిర్వహించగా పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులను నిర్ణీత సమయానికి ఒక గంట ముందు నుంచి అనుమతించారు. నిమిషం నిబంధన కచ్చితంగా అమలు చేయడంతో నిర్ణీత సమయం దాటిన తర్వాత విద్యార్థులను అనుమతించలేదు. ఈ ఎంట్రెన్స్ టెస్టును స్పెషల్ అబ్జర్వర్ రమణ ప్రసాద్, అసిస్టెంట్ కోఆర్డినేటర్ కె.హరికృష్ణలతో పాటు ఇతర అధికారులు పర్యవేక్షించారు.

నిజామాబాద్ నుంచి వచ్చి మాదన్నపేటలో అదృశ్యం



మల్లేష్ (ఫైల్)

చంచల్‌గూడ: మానసిక వ్యాధితో బాధపడుతున్న ఓ వ్యక్తి చికిత్స కోసం నగరానికి వచ్చి తప్పిపోయిన సంఘటన గత నెల 20వ తేదీన మాదన్నపేట పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. మంగళవారం పోలీసులు మీడియాకు లుక్‌ఔట్ నోటీసు విడుదల చేశారు. నిజామాబాద్‌సారంగ్‌పూర్‌లో నివాసముండే మల్లేష్ (40) ఇటీవల విద్యుదాఘాతానికి గురికాగా అప్పటి నుంచి మానసికంగా ఇబ్బంది పడుతున్నాడు. దీంతో అతడికి చికిత్స చేయించేందకు భార్య అంజమ్మ (35) సికింద్రబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తీసుకొచ్చారు. అతడిని ఎర్రగడ్డ మానసికచికిత్స కేంద్రానికి తీసుకెళ్లాలని అక్కడి వైద్యులు సూచించారు. దీంతో ఇంటికి తిరిగి వెళ్దామని సికింద్రబాద్ రైల్వే స్టేషన్‌కు చేరుకుని అనుకోకుండా ఎంఎంటీఎస్ రైలు ఎక్కారు. దీంతో ఆరా తీయగా లోకల్ ట్రెస్ ఎక్కారని ఇతరులు చెప్పడంతో యాఖుత్‌పురా రైల్వే స్టేషన్‌లో దిగి మాదన్నపేట వైపు వచ్చారు. అక్కడ ఉన్న కల్లు దుకాణంలో కల్లు సేవిస్తుండగా భర్త పిచ్చిగా మాట్లాడుతూ.. అక్కడి నుంచి వెళ్లిపోయాడని భార్య ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అలంకారప్రాయంగా వాటర్ ఏటీఎంలు..!

దాహార్తితో అల్లాడుతున్న పాదచారులు

• తక్కువ సంఖ్యలోనే చలివేంద్రాల ఏర్పాటు • తప్పని పరిస్థితుల్లో తాగునీరు కొనుక్కుంటున్న వైనం



సరస్వతినగర్‌లో నిరుపయోగంగా వాటర్ ఏటీఎం

సైదాబాద్: ఆశయం ఎంత ఉన్నతమైనదైనా దానిని సాధించే క్రమంలో ఆచరణలో నిర్లక్ష్యం వహిస్తే లక్ష్యం ఎప్పటికీ నెరవేరదు. నగరంలో జీహెచ్‌ఎంసీ ఏర్పాటు చేసిన వాటర్ ఏటీఎంలు అందుకు నిలువెత్తు నిదర్శనంగా మారాయి. మండే ఎండా కాలంలో పాదచారులు, వాహనదారుల దాహార్తి తీర్చే లక్ష్యంతో గతంలో పలుచోట్ల జీహెచ్‌ఎంసీ అధికారులు వాటర్ ఏటీఎంలు ఏర్పాటు చేసారు. మొదట్లో ఈ వాటర్ ఏటీఎంలు చక్కటి పర్యవేక్షణతో సత్ఫలితాలను ఇచ్చాయి. ఈ ఏటీఎంల ద్వారా ప్రజలు చల్లటి తాగునీటిని అతి తక్కువ ధరలో పొందారు. మండు వేసవిలో చల్లటి తాగునీటిని అందిస్తూ ఈ ఏటీఎంలు మంచిగానే ప్రజాదరణ పొందాయి.

ప్రస్తుతం శిథిలావస్థలకు చేరిన ఏటీఎంలు..

◆ ఒకటి రెండు సంవత్సరాల పాటు మంచిగానే కొనసాగిన వాటర్ ఏటీఎంలు ఆ తరువాత గాడి తప్పాయి. ఏటీఎంలపై పర్యవేక్షణ కరువై అవి నిరుపయోగంగా మారటం మొదలయ్యింది. అధికారుల నిర్లక్ష్యం మరో కారణంగా అవి ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. సైదాబాద్, ఐఎస్‌సదన్ డివిజన్‌లలో పలుచోట్ల ఏర్పాటు చేసిన ఈ వాటర్ ఏటీఎంలు రహదారుల పక్కన అలంకార ప్రాయంగా మిగిలి పోతున్నాయి.

చేసేది లేక వాటర్ బాటిళ్లను కొనుగోలు చేస్తున్న వైనం..

◆ భగభగ మండుతున్న ఎండా కాలం మధ్యాహ్న సమయాల్లో రహదారులపై సంచరిస్తున్న వారు దాహార్తితో అల్లాడుతున్నారు. వాటర్ ఏటీఎంలు నిష్ప్రయోజనంగా మారగా ఈ ఏడు చలివేంద్రాల ఏర్పాటు కూడా తక్కువ సంఖ్యలో కనపడుతున్నాయి. గతంలో ప్రతి ప్రధాన రహదారిపై ఏదో ఒక స్వచ్ఛంద సంస్థ లేదా వ్యక్తిగతంగానూ చలివేంద్రాలు ఏర్పాటు చేసేవారు. వాటి సంఖ్య కూడా తగ్గిపోవటంతో రహదారులపై సంచరించే వారు ప్రత్యామ్నాయాలు వెతుక్కోక తప్పటం లేదు.

అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలి..

◆ సరస్వతీనగర్, సింగరేణి కాలనీ, సుబ్రమణ్యనగర్, ఇంద్రప్రస్థ కాలనీ తదితర ప్రాంతాల్లో గతంలో ఏర్పాటు చేసిన వాటర్ ఏటీఎంలు వేసవి కాలంలో సైదాబాద్, ఐఎస్‌సదన్ డివిజన్‌ల పరిధిలోని ప్రజల దాహార్తిని తీర్చడంలో సఫలమయ్యాయి. రెండేళ్లుగా ఇవి ఎందుకు పనికి రాకుండా పోతున్నాయి. ఇప్పటికైనా జీహెచ్‌ఎంసీ అధికారులు, రెండు డివిజన్ల ప్రజాప్రతినిధులు స్పందించి వాటర్ ఏటీఎంల విషయంలో తగిన చర్యలు తీసుకోవాలని ఇరు డివిజన్ల వాసులు కోరుతున్నారు. ఈ వాటర్ ఏటీఎంలను తిరిగి వినియోగంలోకి తెస్తే చాలా మందికి ఎంతో సౌకర్యంగా ఉంటుందని వారు కోరుతున్నారు.

ప్రజల దాహార్తిని తీర్చాలి...



నిత్యం రహదారులపై పలు పనుల నిమిత్తం తిరిగే ప్రజల దాహార్తిని అధికారులు తీర్చాలి. ఎండా కాలం దృష్టిలో పెట్టుకొని గతంలో ఏర్పాటు చేసిన వాటర్ ఏటీఎంలను వినియోగంలోకి తెస్తే ప్రజలకు ఉపశమనంగా ఉంటుంది. జీహెచ్‌ఎంసీ అధికారులు ఈ విషయమై సత్వరమే తగిన నిర్ణయం తీసుకుంటే బాగుంటుంది.

– లక్ష్మణ్ ఠాకూర్, సైదాబాద్ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి

వాటర్ ఏటీఎంలు బాగుచేయండి...



ఎండలు దంచి కొడుతున్న విషయాన్ని దృష్టిలో ఉంచుకొని జీహెచ్‌ఎంసీ అధికారులు సత్వరమే స్పందించాలి. నిరుపయోగంగా మారిన వాటర్ ఏటీఎంలకు అవసరమైన మరమ్మతులు చేయించి ఉపయోగంలోకి తేవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఎండాకాలంలో ఇవి బాటసారులకు ఎంతోగానో ఉపయోగపడతాయి. అధికారులు వెంటనే తగిన చర్యలు తీసుకోవాలి.

-షేక్ మహమూద్, ఐఎస్‌సదన్ సీపీఐ కార్యదర్శి


ఉద్యోగావకాశాలను సద్వినియోగం చేసుకోవాలి



జాబ్ మేళా ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బలాల

మలక్‌పేట: నిరుద్యోగులకు ప్రభుత్వం కల్పిస్తున్న ఉపాధి, ఉద్యోగావకాశాలు సద్వినియోగం చేసుకోవాలని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. ఎమ్మెల్యే నేతృత్వంతో ఇబ్నాత్ ఫౌండేషన్, ఎంఎస్ఎంఈ, నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ శాఖ, టాంకామ్ సౌజన్యంతో మంగళవారం అక్బర్‌బాగ్‌లోని ఆఫీసర్స్ మెస్‌లో ఏర్పాటు చేసిన గ్రాండ్ జాబ్ మేళాను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మలక్‌పేటలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయడానికి కృషి చేస్తానన్నారు. సమయం వృథా చేసుకోకుండా కలిసివచ్చే అవకాశాలు వినియోగించుకోవాలని యువతకు సూచించారు. ఐటీ,నాన్ ఐటీ రంగాలకు చెందిన 50కంపెనీలు పాల్గొనగా.. జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సయ్యద్ మినాజుద్దీన్, సలామ్ షాహిద్, నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ ట్రైనింగ్ ఆఫీసర్ సతీష్‌రెడ్డి, ఎంఎస్ఎంఈ డైరెక్టర్ దశరథ్, టామ్‌కామ్ ప్రతినిధి షబ్బా, ఇబ్నాత్ ఫౌండేషన్ సభ్యులు మీర్ ముజాహిద్ అలీ, ఎంఐఎం నాయకులు పాల్గొన్నారు.

వసంతరాయలుకు 'గద్దర్ అన్న ఐకాన్ అవార్డు'



అవార్డును అందుకుంటున్న డాక్టర్ వీరభోగ వసంతరాయలు

మన్సూరాబాద్: సాయి అలేఖ్య సాంస్కృతిక సంఘం సేవా సంస్థ ఆధ్వర్యంలో 'జానపదం మా ప్రాణ పదం'గద్దర్ అన్న ఐకాన్ అవార్డును ఎల్‌బీనగర్‌కు చెందిన డాక్టర్ వీరభోగ వసంతరాయలు ప్రజాప్రతి అందుకున్నారు. బీఎం బిర్లా సైన్స్ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, ప్రభుత్వ విప్ మహేందర్‌రెడ్డి, మాజీ కేంద్రమంత్రి వేణుగోపాలాచారి, టూరిజం శాఖ చైర్మన్ పటేల్‌రమేష్‌రెడ్డి, తెలంగాణ సాంస్కృతిక రథసారథి చైర్మన్ వెన్నెల గద్దర్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నట్లు వసంతరాయలు తెలిపారు. ఈ అవార్డు మరింత బాధ్యతను పెంచిందన్నారు. భవిష్యత్‌లో మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతానని ఆయన పేర్కొన్నారు.

దివ్యాంగులకు 'ఆరోగ్యబీమా' వర్తింపజేయాలి



అందె రాంబాబును పరామర్శిస్తున్న వంశరాజు రామచంద్ర

చంపాపేట: తెలంగాణ వ్యాప్తంగా ఉన్న దివ్యాంగులకు రూ.50లక్షలతో కూడిన ఆరోగ్య బీమా పథకం వర్తింపజేయాలని రాష్ట్ర వికలాంగుల రాజ్యాధికార ఫోరం అధ్యక్షుడు వంశరాజు రామచంద్ర ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర వికలాంగుల హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు అందె రాంబాబు ఇటీవల ప్రమాదవశాత్తు కిందపడి కాలుకు తీవ్ర గాయం అయ్యింది. స్థానికంగా ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయనను మంగళవారం రామచంద్ర పరామర్శించారు. ఈ సందర్భంగా రామచంద్ర మాట్లాడుతూ... రాష్ట్రంలోని వికలాంగులు ఆర్థిక, అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. దివ్యాంగుల సమస్యలను త్వరలో సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని స్పష్టం చేశారు.

లక్ష్మీనగర్‌లో అక్రమ నిర్మాణాన్ని అడ్డుకోండి

జీహెచ్‌ఎంసీ అధికారులకు బీజేపీ నేత వినతి



సైదాబాద్: జీహెచ్‌ఎంసీ నియమ నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా నిర్మిస్తున్న భవన నిర్మాణ పనులను వెంటనే అధికారులు అడ్డుకోవాలని బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధికార ప్రతినిధి వీరేంద్రబాబు యాదవ్ కోరారు. ఐఎస్‌సదన్ డివిజన్ పరిధి లక్ష్మీనగర్‌కాలనీ చౌరస్తాలో కొన్ని రోజుల క్రితం భారీ సెల్లార్‌తో చేపట్టిన అక్రమ నిర్మాణంపై బీజేపీ నాయకులు టౌన్‌ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. కొన్ని రోజులు పనులు నిలిపేసిన నిర్మాణదారుడు మరలా అక్రమంగా పనులు మొదలు పెట్టాడు. ఈ విషయమై మంగళవారం వీరేంద్రబాబు జీహెచ్‌ఎంసీ డీసీ మంగతాయారు, టౌన్ ప్లానింగ్ అధికారులకు ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన లక్ష్మీనగర్‌లో విలేకరులతో మాట్లాడుతూ... కొందరు అధికారుల అండతోనే పలువురు అక్రమ నిర్మాణాలను విచ్చలవిడిగా సాగిస్తున్నారని ఆరోపించారు. లక్ష్మీనగర్‌లో అక్రమ నిర్మాణం విషయమై తాము ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా టౌన్‌ప్లానింగ్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఇక్కడి అధికారులు తగిన చర్యలు తీసుకోకుంటే ఈ నిర్మాణం విషయమై తాము జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

రేపు గురుకుల కళాశాలల్లో ప్రవేశాలకు కౌన్సెలింగ్

మహేశ్వరం: 2025-26 విద్యాసంవత్సరానికి గాను రాష్ట్ర గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాల మహేశ్వరం, కందుకూరులో ఇంటర్ ప్రథమ సంవత్సరం సీఈసీ, హెచ్ఈసీ గ్రూపులలో ప్రవేశాలకు సంబంధించి ఈ నెల 15వ తేదీన ఉదయం 11 గంటలకు పీవీటీజీ బాలుర కళాశాల హయత్‌నగర్‌లో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ నళిని మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. పదిలో ఉత్తీర్ణులైన విద్యార్థులు బదిలీ ధ్రువీకరణ పత్రం, మార్కుల మెమో, స్టడీ, కండక్ట్ సర్టిఫికెట్, కుల, ఆదాయ ధ్రువపత్రాలు, ఆధార్, స్పోర్ట్స్, అర్ఫాన్, పీహెచ్‌సీ ధ్రువీకరణ పత్రాలు, మూడు కలర్ ఫొటోలతో హాజరుకావాలని సూచించారు.

శ్మశానవాటికల్లో వసతులు కల్పించండి

మీర్‌పేట: శ్మశానవాటికల్లో మౌలిక వసతులు కల్పించాలని స్థానిక బీజేపీ నాయకులు మంగళవారం మీర్‌పేట కార్పొరేషన్ రెవెన్యూ అధికారి చంద్రశేఖర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మీర్‌పేట-1, 2 అధ్యక్షులు భిక్షపతి చారి, ముఖేష్‌ముదిరాజ్ మాట్లాడుతూ.. పెద్దచెరువు, లెనిన్‌నగర్ వాటర్‌ట్యాంక్, జిల్లెలగూడ శ్మశానవాటికలలో కనీస సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, అభివృద్ధి కోసం గతంలో నిధులు విడుదల చేసినప్పటికీ పనులు జరగడం లేదన్నారు. తక్షణమే శ్మశానవాటికల్లో స్నానాల గదులు, లైటింగ్ ఏర్పాటు చేయడంతో పాటు పిచ్చిమొక్కలను తొలగించి శుభ్రం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఫ్లోర్ లీడర్ కీసర గోవర్ధన్‌రెడ్డి, నాయకులు కోడూరు సోమేశ్వర్, గాజుల మధు, భీంరాజ్, సూల ప్రభాకర్, గోపీనాథ్, రమేష్, సిద్దాల శ్రీనివాస్ హైందవి ఉన్నారు.

రోహింగ్యాలను గుర్తించాలి

భద్రత దృష్ట్యా మీర్‌పేట ప్రాంతంలో నివాసముంటున్న రోహింగ్యాలను గుర్తించి వారి ఆధార్ కార్డులను పరిశీలించాలని బీజేపీ నాయకులు కోరారు. అనంతరం మీర్‌పేట ఇన్‌స్పెక్టర్ నాగరాజుకు వినతిపత్రం అందజేశారు. ప్రమాదకరంగా మారే అవకాశం ఉన్నందున రోహింగ్యాలను ఇక్కడి నుంచి పంపించాలని కోరారు.

పేదల పక్షాన నిరంతర పోరాటం

సీపీఐ కార్యవర్గ సభ్యుడు రవీంద్రాచారి

మీర్‌పేట: బాలాపూర్ మండలం జిల్లెలగూడ శాఖ సీపీఐ పార్టీ నూతన కమిటీని మంగళవారం పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందోజు రవీంద్రాచారి ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. కార్యదర్శిగా రమావత్ పాండునాయక్, సహాయ కార్యదర్శులుగా బ్రహ్మచారి, ఎం.కృష్ణ, కౌన్సిల్ సభ్యులుగా దశరథ, శ్రీనివాస్, కే.పద్మ, జంగయ్య జర్పుల శివనాయక్, ఇద్దరు కో-ఆప్షన్ సభ్యులుగా ఎన్నికయ్యారు. అనంతరం పార్టీ నాయకులు దశరథ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రవీంద్రాచారి మాట్లాడుతూ.. సీపీఐ ఎల్లప్పుడూ పేదల పక్షాన పోరాడుతుందని, భూ పోరాటాల్లో భాగంగా 10 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచిందని గుర్తుచేశారు. భవిష్యత్తులో నిర్వహించే ప్రజా పోరాటాలకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

'కేంద్రం కార్మిక వ్యతిరేక పాలన సాగిస్తోంది'



కార్మికుల సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి చంద్రమోహన్

చైతన్యపురి: కేంద్ర ప్రభుత్వం కార్మిక, ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తోందని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ఎం.చంద్రమోహన్ విమర్శించారు. చైతన్యపురి డివిజన్‌లోని కామ్రేడ్ బోడెపుడి వెంకటేశ్వరరావు స్మారక కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం మున్సిపల్ కార్మికుల సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా స్వదేశీ, విదేశీ కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతుందన్నారు. జాతీయ సహజ వనరులు డీజిల్, పెట్రోల్, వంటగ్యాస్ ఇతర నిత్యావసరాల ధరలు పెంచి ప్రజలపై పెనుభారం మోపుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని... మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు పర్మనెంట్ చేసి రూ.26వేలు చెల్లించాలని.. ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈనెల 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ సరూర్‌నగర్ సర్కిల్ కన్వీనర్ మల్లెపాక వీరయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు కీసర నర్సిరెడ్డి, జీహెచ్‌ఎంసీ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు ఆలేటి ఎల్లయ్య, నాయకులు కృష్ణయ్య, కదారి రాములు, మల్లేష్, పద్మ, నవనీత, గీత, అరుణ తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు ఇచ్చేప్పుడు 'లే-అవుట్ల'ను పరిశీలించాలి



హిమపురికాలనీలో సమస్యలను తెలుసుకుంటున్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: భవన నిర్మాణాలకు అనుమతులు ఇచ్చే సమయంలో టౌన్ ప్లానింగ్ అధికారులు ఆయా కాలనీ లే-అవుట్లను క్షుణంగా పరిశీలించిన తర్వాతనే అనుమతులు ఇవ్వాలని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి సూచించారు. హిమపురికాలనీలో మంగళవారం ఆయన పర్యటించి స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... కాలనీలోని 400 గజాల ఓపెన్ స్థలం పాఠశాల ఏర్పాటుకు వదిలారని ఆ స్థలంలో కేవలం పాఠశాలకు మాత్రమే అనుమతులు ఇవ్వాలన్నారు. కాలనీలోని పార్కు స్థలం వివాదాన్ని ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ పరిశీలించారని.. త్వరలో నివేదిక ఇవ్వనున్నట్లు తెలిపారు. కాలనీలోని డ్రైనేజీ సమస్యను పరిష్కరించామన్నారు. కాలనీ ముంపునకు గురికాకుండ ప్రత్యేక నాలాను ఏర్పాటు చేశామని వివరించారు. ధ్వంసమైన డ్రైనేజీ మ్యాన్‌హోళ్ల మూతలను మార్పిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు మధుసూదన్‌రెడ్డి, రాములు, బద్రీనాథ్, గోపి తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించడంలో ముందుండాలి

రాష్ట్ర వ్యవసాయ మార్కెట్ ఉద్యోగుల ఫోరము అధ్యక్షుడు చిలుక నర్సింహారెడ్డి



పదోన్నతి పొందిన అశోక్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న చిలక నర్సింహారెడ్డి, ముఖర్రం

చాదర్‌ఘాట్: మార్కెట్ యార్డులలో రైతులకు మద్దతు ధర... వసతుల కల్పన విషయంలో మార్కెట్ ఉద్యోగులు ముందుండాలని రాష్ట్ర వ్యవసాయ మార్కెట్ ఉద్యోగుల సెంట్రల్ ఫోరం ప్రెసిడెంట్ చిలుక నర్సింహారెడ్డి, కార్యదర్శి ముఖరం సూచించారు. మంగళవారం మలక్‌పేట వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో గ్రేడ్-2 నుంచి గ్రేడ్-1గా పదోన్నతి పొందిన అధికారి పి.అశోక్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మార్కెట్ యార్డులో రైతుల సంక్షేమం కోసం ఉద్యోగులు పాటుపడాలని సూచించారు. ఈ కార్యక్రమములో హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ ఎస్‌జీఎస్ దామోదర్, ఉద్యోగులు శ్రీనివాస్, పవన్ పాల్గొన్నారు.

శ్మశానవాటికలో వసతులు మెరుగుపరుస్తాం



స్తంభాల ఏర్పాటు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

మలక్‌పేట: తీగలగూడ హిందూ శ్మశానవాటికలో మెరుగైన వసతులు కల్పిస్తామని మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి అన్నారు. ఈస్ట్ ప్రశాంత్‌నగర్‌లోని శ్మశానవాటికలో మంగళవారం అభివృద్ధి పనులు ఆమె ప్రారంభించారు. విద్యుద్దీపాల కోసం 15 విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... విద్యుత్ దీపాలు ఏర్పాటుతో శ్మశానవాటికలో ప్రధాన సమస్యకు పరిష్కారం లభించిందన్నారు. వెంటనే స్తంభాలకు లైట్లు బిగించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో శ్మశానవాటిక నిర్వాహకుడు బల్వంత్ జగన్, స్ట్రీట్ లైట్స్ లైన్ ఇన్‌స్పెక్టర్ దుర్గారావు, లైన్‌మెన్ సురేష్, బస్తీ నాయకులు నర్సింహ, శంకర్, మల్లేష్, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

వికలాంగులకు సామాజిక భద్రత కల్పించాలి



కార్పొరేషన్ జీఎంకు వినతి అందజేస్తున్న ఎన్‌పీఆర్‌డీ ప్రతినిధులు

చాదర్‌ఘాట్: వికలాంగులకు సామాజిక భద్రత కల్పించాలని ఎన్‌పీఆర్‌డీ ప్రధాన కార్యదర్శి అడివయ్య డిమాండ్ చేశారు. తెలంగాణలో వికలాంగులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను పరిష్కరించాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం మలక్‌పేటలోని వికలాంగుల సంక్షేమశాఖ డైరెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యం.అడివయ్య మాట్లాడుతూ... వికలాంగుల కమిషన్ ఏర్పాటు చేయాలన్నారు. స్థానిక సంస్థల్లో వికలాంగుల ప్రాతినిధ్యం కోసం అసెంబ్లీలో చట్టం చేయాలని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో వికలాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. తమ సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమం ఉధృతం చేస్తామన్నారు. అనంతరం సంఘం ప్రతినిధులు కార్పొరేషన్ జీఎం ప్రభంజన్‌కు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో ఎన్ఆర్‌డీపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.వెంకట్, కోశాధికారి ఆర్.వెంకటేష్, కేంద్ర కమిటి సభ్యులు సి.సాయమ్మ, జె.రాజు పాల్గొన్నారు.

క్రైస్తవులు కలసికట్టుగా నడవాలి



సెమినార్‌కు హాజరైన పాస్టర్లు, క్రైస్తవ సంఘాల నాయకులు

మలక్‌పేట: మలక్‌పేట నియోజకవర్గం పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం దిల్‌సుఖ్‌నగర్ బాప్టిస్ట్ చర్చిలో పాస్టర్లకు 'చర్చి ఎదుగుదల'అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్లు మాట్లాడుతూ.. చర్చి సభ్యులకు పరిచర్యలో సభ్యులందరికి భాగస్వామ్యం కల్పించాలన్నారు. క్రైస్తవులపై జరుగుతున్న దాడులను అధిగమించడానికి కలసికట్టుగా నడవాలన్నారు. భారత రాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛను హరించే విధంగా చర్చిలపై దాడులకు పాల్పడుతున్న వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు ఎర్రోళ్ల మాణిక్యం అబ్రాహం అధ్యక్షతన జరిగిన సెమినార్‌లో అంబర్‌పేట బేతేల్ సెల్ బేస్డ్ చర్చి నిర్వాహకులు బిషప్ కే. సుధాకర్ బైబిల్ వాక్యాన్ని బోధించి ప్రార్థనలు చేశారు. ఏసీపీఏ జనరల్ సెక్రటరీ వరకుమార్, అసోసియేషన్ ఉపాధ్యక్షుడు రెవరెండ్ శాంత్‌కుమార్, జనరల్ సెక్రటరీ అనితా షీబారాణి, ట్రెజరరీ శ్రీధర్‌రాజు, బాప్టిస్ట్ చర్చి కమిటీ అధ్యక్షుడు వేమూరి లూకానందరావు, పాస్టర్లు, చర్చి పెద్దలు, క్రైస్తవ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9666021515
9912220363
9912220365